





ఇక 'ఉపాధి' కూలి ₹300

ఉమ్మడి జిల్లాలో 5.51 లక్షల మందికి లబ్ధి



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 28: వ్యవసాయ పనులులేని సమయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం వీరికి గరిష్ఠంగా రోజుకు కూలి రూ.272 చెల్లిస్తున్నారు. కాగా ఈ మొత్తాన్ని రూ.300కు పెంచుతూ బుధవారం రాత్రి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఏప్రిల్ 1నుంచి కూలి రేట్లు పెరగనున్నాయి.ఖమ్మం జిల్లాలో 589గ్రామ పంచాయతీల్లో మొత్తం 3.06లక్షల జాబ్‌కార్డులున్నాయి. వీటిలో 6.46లక్షల కూలీలనమోదు జరిగింది. వీటిలో 1.9 లక్షల జాబ్‌కార్డుల్లో 3.2లక్షల కూలీలు మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీల్లో మొత్తం 2.19లక్షల జాబ్‌కార్డులున్నాయి. వీటిలో 4.51లక్షల కూలీల సంఖ్య నమోదైంది. కాగా 1.36లక్షల జాబ్‌కార్డుల్లో 2.31లక్షల కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.51లక్షల కూలీలకు పెరిగిన వేతనాల లబ్ధి చేకూరనుంది.

మీరే తేల్చుకోండి..



- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక బాధ్యతను టీపీసీసీకే అప్పగించిన అధిష్ఠానం
- ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మారిన పొలిటికల్ సీన్
- టికెట్ పోరులో తగ్గేదేలే అంటున్న నేతలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ఆశావహులు





ఖమ్మం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం హస్తిన నుంచి హైదరాబాద్‌కు మారింది. ఖమ్మం అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం ఎటూ తేల్చలేక స్థానికంగానే తేల్చుకోండని పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ రాష్ట్ర పీసీసీకి అప్పగించింది. దీంతో ఖమ్మం అభ్యర్థి ఎంపికపై హైదరాబాద్‌లో కసరత్తు జరుగుతోంది. ఎవరికి వారు టికెట్‌పై పట్టుబట్టడంతో అభ్యర్థి ఎంపిక రాష్ట్ర పీసీసీకి, ఏఐసీసీకి పరీక్షగా మారింది. టికెట్ ఆశిస్తున్న వారిలో ముగ్గురు మంత్రుల బంధువులు ఉండడం, వారంతా తమవారికోసం ఉన్నతస్థాయిలో పావులు కదుపుతుండడంతో టికెట్ ఎంపిక వ్యవహారం కొలిక్కి రావడంలేదు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కోసం ప్రధానంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ వి.హనుమంతరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, కొత్తగూడేనికి చెందిన నాగసీతారాములు ఖమ్మం టికెట్ ఆశిస్తున్నారు. వీరే కాకుండా కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తన వర్గానికి చెందిన ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేరు కూడా ప్రతిపాదించారు. దాంతో సీటు ఎవరికివ్వాలో తేల్చకపోతున్నారు.

మరోవైపు ప్రియాంకగాంధీ రెండోస్థానంగా ఖమ్మం బరి లో ఉంటారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో బీసీ వర్గానికి ఖమ్మం సీటు కేటాయిస్తారని కూడా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ సీటుకోసం ఉన్నతస్థాయినుంచి ఒత్తిళ్లు పెరగడంతో అధిష్ఠానం ఎటూ తేల్చడంలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ టికెట్ ఎవరికిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఖమ్మం లోక్‌సభకు 17సార్లు ఎన్నిక జరిగితే 11 సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ హైదరాబాద్ రెండుసార్లు, సీపీఎం, టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్ పార్టీలు ఒక్కొక్కసారి గెలుపొందాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌కు బలమున్న నియోజకవర్గంగా ఖమ్మం ప్రసిద్ధి గాంచింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమి ఘన విజయం సాధించడం, భారీ ఆధిక్యత కనబరచడంతో ఖమ్మం టికెట్‌పై అందరి దృష్టి పడింది.

ఖమ్మం నగరంలోని కొత్త బస్టాండ్, సిటీ బస్టాండ్ నుంచి కోదాడ, ఇల్లెందు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గతంలో ఉన్న ఒక్క బస్టాండ్ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయగా, ప్రస్తుతం రెండు బస్టాండ్‌లు ఉన్నప్పటికీ బస్సులు సరిపడా లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం నుంచి కోదాడకు ప్రతి గంటకు ఒక సర్వీస్ ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నా... బస్టాండ్‌లో ఆ పరిస్థితి లేదు. సాయంత్రం ఆరు దాటితే కొత్త బస్టాండ్ నుంచి ఒక్క బస్సు కూడా అందుబాటులో ఉండటంలేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఇక సిటీ బస్టాండ్ నుంచి వచ్చే ఒక్క బస్సుకు వందల కొద్దీ ప్రయాణికులు ఎగబడుతున్నారని వాపోతున్నారు. మరోక బస్సును ఏర్పాటు చేయమని ఆర్టీసీ అదికారులను కోరినా స్పందన లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- పెరిగిన రద్దీతో ప్రయాణికుల కష్టాలు
- ఏ బస్సు ఎక్కడ ఎక్కాలో తెలియక ఇబ్బందులు
- కొత్త బస్టాండ్, సిటీ బస్టాండ్‌లో గంటలకొద్దీ నిరీక్షణ
- అందుబాటులో ఉండని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- ఎంత మొత్తుకున్నా స్పందన లేని ఆర్టీసీ అధికారులు

బస్సులు పెంచండి మహాప్రభో...



ఖమ్మం నుంచి కోదాడ, ఇల్లెందు ప్రాంతాలకు సర్వీసుల కొరత

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 28: ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీనికి తగ్గట్టు బస్సుల సంఖ్య లేకపోవటంతో రోజు ఏదో ఒక ప్రాంతంలో ప్రయాణికులకు, డ్రైవర్, కండక్టర్లకు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు బస్సుల సంఖ్యను మాత్రం పెంచడంలేదు. ఇల్లెందు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి ఇదే వరస. వాస్తవానికి కొత్త బస్టాండ్ ప్రారంభమైన నాటి నుంచి పల్లెవెలుగు సర్వీస్‌లు సిటీ బస్టాండ్ నుంచే నడుస్తాయని అధికారులు తెలిపారు. కానీ అందుకు తగ్గట్టుగా బస్సులు లేకపోవడంతో సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఏ బస్సు ఎప్పుడు వస్తోందో, ఏ సమయానికి వస్తోందో తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

కొత్త బస్టాండ్‌లో గందరగోళం

గతంలో కొత్త బస్టాండ్ నుంచి అన్ని సర్వీసులు నడిపిన ఆర్టీసీ అధికారులు... ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్, ఆపై సర్వీసులనే నడుపుతున్నారు. ఇది ప్రయాణికులకు తెలియక ఎక్కువగా కొత్త బస్టాండ్‌కే వచ్చి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పల్లెవెలుగు బస్సులు నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా వచ్చి కొత్త బస్టాండ్‌కు వచ్చేవి. విద్యార్థులు ఎక్కువగా ఎన్టీఆర్ సర్కిల్‌లో బస్సులు ఎక్కేవారు. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సులు ఐటీహబ్ (ఇల్లెందు క్రాస్ రోడ్) రోడ్ మీదుగా వైరా రోడ్‌కు నడుస్తుండటంతో ప్రతీ ఒక్కరు పల్లెవెలుగు ఎక్కాలంటే ఐటీ హబ్ సెంటర్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నగరంలోని కొత్త బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం గంటల కొద్దీ ప్రయాణికులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఖమ్మం డిపో నుంచి కోదాడ, ఇల్లెందు, సూర్యాపేట, తదితర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించాలంటే గంటల కొద్దీ ఆగక తప్పడం లేదు. ఇతర డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు వస్తే తప్ప ప్రయాణికులకు బాధలు తప్పడం లేదు. ఖమ్మం డిపో బస్సులు ఆయా ప్రాంతాలకు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

గురువారం నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి కోదాడ వెళ్లేందుకు ఓ ప్రయాణికుడు మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తే 3.30 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డాడు. వచ్చిన ఒక్క బస్సులో ప్రయాణికులు అధికంగా ఎక్కడంతో మిగిలిన వారు సీట్లు లేక వేచిచూసే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై బస్టాండ్ అధికారులను అడిగితే సిటీ బస్టాండ్‌కు వెళ్లండంటూ కోపంగా మాట్లాడారని ప్రయాణికులు వాపోతున్నారు.



అభ్యర్థులు, న్యాయవాదుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీల్ వేస్తున్న దృశ్యం

ఖమ్మం బార్‌లో ఉత్కంఠ

- పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు నిలిపివేత
- న్యాయవాదుల ఓటరు జాబితా నిబంధనల ప్రకారం లేదని ఫిర్యాదులు
- కౌంటింగ్ నిలిపివేస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు

ఖమ్మం లీగల్ మార్చి 28: ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా లేదని కొందరు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తెలంగాణ బార్‌కౌన్సిల్ కౌంటింగ్ ప్రక్రియను నిలిపి వేసింది. వివరాల్లోకి వెళ్తితే.. 2024-25 సంవత్సరానికి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు ఆవరణలో జరిగాయి. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 946 ఓట్లకు గాను 757 ఓట్లు పోలయ్యాయి. ఇప్పటి వరకు నిర్వహించిన ఖమ్మం బార్ ఎన్నికల్లో ఈసారి మాత్రమే అతితక్కువ ఓటింగ్ శాతం నమోదుకావడం గమనార్హం.

అయితే పోలింగ్ పూర్తయిన తరువాత బార్ అసోసియేషన్ కార్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తుండగా, నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా లేదని కొందరు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్‌ను నిలిపేస్తూ బార్‌కౌన్సిల్ ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు లెక్కింపు ప్రక్రియను చేపట్టవద్దని ఆదేశించింది. దీంతో బ్యాలెట్ బాక్స్‌లను అభ్యర్థుల సమక్షంలో సీలు వేసి బార్ అసోసియేషన్ కార్యవర్గ ఆఫీసులో భద్రపరిచారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తదుపరి ఉత్తర్వులు అందిన తరువాత న్యాయవాదుల సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించి, ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిలిపివేయడంతో న్యాయవాదులు ఆశ్చర్యానికి లోనయ్యారు. అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి పోటీ పడగా, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు పోటీపడ్డారు. గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కల్యాణి బరిలో నిలిచారు.

మణుగూరు బార్‌లో టైట్ రిజల్ట్

- అధ్యక్ష బరిలో నిలిచిన ఇద్దరికి సమాన ఓట్లు
- చెరి ఆరు నెలలు పదవి

మణుగూరు, మార్చి 28: మణుగూరు కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు ప్రాంగణంలో జరిగాయి. అధ్యక్ష పదవికి న్యాయవాదులు చిర్రా రవికుమార్, మేదర మెట్ల శ్రీనివాస్, జాడి చొక్కారావు, సావిత్రి బరిలో నిలిచారు. మొత్తం 45మంది సభ్యులు గల ఈ అసోసియేషన్‌లో చిర్రా రవికుమార్‌కు 16, మేదరమెట్ల శ్రీనుకు 16 ఓట్లు వచ్చాయి. ఫలితం టైగా మారడంతో సందిగ్ధం నెలకొంది. దీంతో ఎన్నికల అధికారులు జి.వెంకటరత్నం, మధు బైలా ప్రకారం టాస్ వేశారు. టాస్ గెలిచిన రవికుమార్ మొదటి ఆరు నెలల కాలం అధ్యక్ష బాధ్యతను నిర్వహించనుండగా, మరో ఆరునెలలు శ్రీనివాస్ చేపట్టనున్నారు. జనరల్ సెక్రటరీకి సంబంధించి దాసరి కవిత తన ప్రత్యర్థి చిర్రా సరస్వతిపై విజయాన్ని కైవసం చేసుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా రామ్మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి అదనపు కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతన్న పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనకు ఏ, బీ గ్రేడులుగా విభజించి మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యంకు రూ 2,203, బీ గ్రేడ్ ధాన్యంకు రూ 2,183 గా నిర్ణయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 61 కొనుగోళ్ల కేంద్రాలు, ఏప్రిల్ 5న 36మ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఏప్రిల్ 10న 31 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలన్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రత అధికంగా ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు వడదెబ్బకు గురి కాకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయాలన్నారు. జిల్లాకు సమీప రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దుల్లో 8 చెక్‌పోస్టులే ఏర్పాటు చేసి పటిష్ఠనిఘా చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీవో విద్యాచందన, పౌరసరఫరాల మేనేజర్ త్రినాథ్, పౌరసరఫరాల అధికారి రుక్మిణి, డీసీఓ కుర్షిద్, వ్యవసాయ అధికారి బాబూరావు, జీసీసీ మేనేజర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

నేడు భద్రాద్రికి ఉన్నతాధికారుల రాక



భద్రాచలం, మార్చి 28: భద్రాచలం పుణ్యక్షేత్రంలో శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం 'ప్రసాద్' పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వారు పరిశీలించనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కూడా పరిశీలించనున్నారు.

ఈ ఏడాది వర్జీనియా పొగాకుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఎస్ఎల్ఎస్ పరిధిలో పొగాకు అత్యధికంగా పండుతోంది. ఈ ఏడాది వేలం కేంద్రాలు తెరిచిన రోజే రికార్డుస్థాయిలో కిలో పొగాకు ధర రూ.237 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలోనే రికార్డు ధర ఉండటంతో ముున్ముందు ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యానికి మించి పొగాకు ఉత్పత్తులు వస్తున్నా అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో వర్జీనియా పొగాకుకు మంచి ధర లభిస్తోందని రైతులు చెబుతున్నారు.




పొగాకు రైతుకు లాభాల కిక్కు

- 'వర్జీనియా' రకానికి పెరిగిన డిమాండ్
- అత్యధికంగా కిలో రూ.237 పలికిన ధర
- విదేశీ ఆర్డర్లతో ఊపుమీదున్న మార్కెట్

అశ్వారావుపేట, మార్చి 28: విదేశీ ఆర్డర్లతో డిమాండ్ ఈ ఏడాది పొగాకు బోర్డు ఒక్క ఎస్ఎల్ఎస్ పరిధిలోనే (ఉత్తర ప్రాంత తేలికపాటి నేలలు) 42 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించుకుంది. అయితే రైతులు 67 మిలియన్ కిలోల వరకు పంటను ఉత్పత్తి చేశారు. అంటే లక్ష్యానికి మించి 25మిలియన్ కిలోల పొగాకు అదనంగా ఉత్పత్తి జరిగింది. వాస్తవంగా అయితే ఉత్పత్తి పెరగటంతో ధర పడిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందారు. కానీ అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు ఆర్డర్లు భారీగా ఉండటంతో వర్జీనియా పొగాకుకు మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ఆరంభంలోనే జంగారెడ్డిగూడెం ప్లాట్‌ఫామ్ పరిధిలో జరిగిన పొగాకు వేలంలో గ్రేడ్-1 రకం ఏకంగా కిలో రూ.237 పలికింది. గతేడాది కిలో రూ.190వరకు ధర పలికింది. ఈ ఏడాది ధరతోపాటు వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభంలో తుఫాన్‌తో నష్టం..

సీజన్ ప్రారంభంలో భారీ తుఫాన్ రావడంతో మొక్క దశలో ఉన్న తోటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో పొగాకు రైతులకు ఈ ఏడాది ఇబ్బందులు తప్పవేమో అని అందరూ అనుకున్నారు. ఆ తరువాత వాతావరణం అనుకూలించడం, యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు సమృద్ధిగా పండాయి. గత ఐదారేళ్లుగా అనేక ఒడిదుడుకులకు లోనవుతున్న వర్జీనియా రైతులు ఈ ఏడాది పరిస్థితులు అనుకూలించడంతో మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడి ప్రాంతంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సుమారు 5వేల ఎకరాల వరకు వర్జీనియా పొగాకు పండిస్తుంటారు. పొగాకు ద్వారా ఈ ఏడాది రూ.1,000 కోట్ల మేర విదేశీ మార్కెట్ ఆదాయం వస్తుందని భావిస్తున్నారు.



6

మావోయిస్టు డిప్యూటీ కమాండర్, కొరియర్ అరెస్టు


- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్



6

ఆక్రమణల తొలగింపు

- నివేశన స్థలాలను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు
- నగరంలో కలకలం



6

అవమాన భారంతో...

- అంజనాపురం జీపీ ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- పంచాయతీ కార్యదర్శే కారణమని సెల్ఫీ వీడియో

ఈ జిల్లా బిడ్డగా నన్ను ఆశీర్వదించండి

ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

కొత్తగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నేను ఈ జిల్లా బిడ్డనని, ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని, భారతీయ జనతా పార్టీ నుంచి ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓట్లు వేసి గెలిపిస్తే జిల్లాను అభివృద్ధి చేసి చూపిస్తానని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో రాబోయేది మోదీ ప్రభుత్వమేనన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా బీజేపీని గెలిపిస్తే జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆయన హామీ ఇచ్చారు. ఇందు కోసం తన వద్ద ప్రత్యేకమైన ప్రణాళిక ఉందని గుర్తు చేశారు. తనకు పైలట్ రంగంలో అనుభవం ఉందని ఈ నేపథ్యంలో కేంద్ర నాయకత్వంలో చర్చలు జరిపి జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తానని, అదేవిధంగా భద్రాద్రిని అధ్యాత్మిక కారిడార్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం తాను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఐఐఎంల్లో విద్యాభ్యాసం చేసిన నిపుణులు, అనుభవజ్ఞులతో విజన్ డాక్యుమెంట్లు రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ఎన్ఎండీసీ ఆధీనంలో ఉన్న 600 ఎకరాల స్థలంలో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెం నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షులు రంగాకిరణ్ కార్యకర్తలతో వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ. రంగాకిరణ్, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామలింగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చెర్వు శ్రీను, పార్లమెంటరీ సహాయ కన్వీనర్ జల్లారపు శ్రీనివాస్, నాయకులు రాయుడు నాగేశ్వరరావు, గొడుగు శ్రీధర్, నరేంద్రబాబు, రాజేష్, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

అధికారం కోసం వచ్చే నాయకులు అవసరం లేదు

కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్

సత్తుపల్లి, మార్చి28: అధికారం కోసం ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చే నాయకులు మాకు అవసరం లేదు, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న వారు మాత్రమే మాకు ముఖ్యం అంటూ జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం తల్లాడ, సత్తుపల్లిలలో జరిగిన కార్యకర్తల అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకున్నా పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా నాయకులు, కార్యకర్తలు పార్టీని నమ్ముకుని ఉన్నారని అన్నారు. కానీ మొన్నటి వరకు అధికారంలో ఉన్న నాయకులు కొందరు అధికారం చేజారిన వంద రోజుల్లోనే తిరిగి కాంగ్రెస్‌లోకి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారు కాంగ్రెస్ పార్టీకి అవసరం లేదని అన్నారు. గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఇతర పార్టీ నాయకులు కాంగ్రెస్‌లోకి చేరాలంటే గ్రామస్థాయి, కాంగ్రెస్ నాయకుల అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన రాగమయి నియోజకవర్గానికి ఏమి సేవ చేస్తారంటూ కొందరు నాయకులు విమర్శలు చేశారని, వారి నోరు మూత పడేలా వంద రోజులలో రూ.100కోట్ల నిధులు సాధించి అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పాల్వంచ, మార్చి 28: పంట దిగుబడి రాలేదన్న మనోవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం యనంబైలు గ్రామానికి చెందిన మంత్రి శశికుమార్(26) ఇస్త్రీ షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనుల్లో తమ కుటుంబ సభ్యులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. గత మంగళవారం ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదన్న మనోవేదనతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పత్రికా విలేకరిపై దాడి

అర్బన్ పోలీసులకు ఫిర్యాదు..కేసు నమోదు

ఖమ్మంక్రైం, మార్చి 28: నగరంలోని ఓ పత్రికా విలేకరిపై కొంతమంది దాడిచేసిన సంఘటన నగరంలో జరిగింది. వివరాల ప్రకారం.. ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న వ్యక్తి తన విధులు ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్నారు. ఈనేపథ్యంలో కొంతమంది కారులో వచ్చి సదరు విలేకరి నివాసం ఉంటున్న ధంసలాపురం కాలనీలో అతని ద్విచక్రవాహనాన్ని అడ్డగించి దాడి చేశారు. దీంతో సదరు విలేకరి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు నిందితులును అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తి చేస్తున్న అక్రమాలపై కథనం రాయడంతో ఈదాడికి దారి తీసినట్టు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావులు దాడిని ఖండించారు. అ నంతరం మల్టీజోన్ ఐజీ రంగనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి నిందితులను శిక్షించాలని కోరారు.

విద్యార్థుల అరిగోస

- కోర్సు ముగిసినా కాలేజీల చుట్టూ ప్రదక్షిణలు
- ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్న యాజమాన్యాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకుంటున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు

ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుంటుబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆలోచనతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చింది. కొన్నేళ్లుగా ఫీజులు రాకపోవడంతో విద్యార్థులకు చదువు పూర్తైనా సర్టిఫికెట్లు అందక తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. ఇటు ఫీజులు చెల్లించలేక, వచ్చిన ఉద్యోగాలలో చేరలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫీజు మొత్తం చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని యాజమాన్యాలు సూచిస్తుండడంతో దిక్కుతోచ నిస్థితిలో పడ్డారు.

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 28: ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుంటుబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ వర్గాల విద్యార్థులకు బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డిగ్రీ, పీజి విద్యను అందించాలనే ఆలోచనతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా విద్యను అందిస్తోంది. కాని గత కొన్నేళ్లుగా ఫీజులు రాకపోవటంతో ఆయా విద్యా సంస్థలలో చదువుకున్న విద్యార్థులకు చదువు పూర్తైనా సర్టిఫికెట్లు అందక తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. ఇటు ఫీజులు చెల్లించలేక, వచ్చిన ఉద్యోగాలలో చేరలేక ఇబ్బందులకు పడుతున్నట్లు పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ముఖ్యంగా కోర్సులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆయా సంస్థలు నిరాకరిస్తున్నాయి. ఫీజు మొత్తం చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన తర్వాత మీరు కట్టిన మొత్తం వెనక్కు ఇస్తామని చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నానే పలువురు వాపోతున్నారు. ఫీజు కట్టాల్సిన మెత్తానికి విద్యార్థుల తల్లితండ్రుల నుంచి చెక్కులు ప్రామిసరీ నోట్లను తీసుకోని సర్టిఫికెట్లు అందిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి.

ఖమ్మానికి చెందిన రంజిత్ జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేశాడు. డిస్టింక్షన్‌లో పాసయ్యాడు. క్యాంపస్ సెలక్షన్‌లో విప్రో (చెన్నై)లో ఉద్యోగం సాధించాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగంలో చేరేందుకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని కంపెనీ స్పష్టం చేసింది. దీంతో కాలేజీకి వెళ్లిన అతడికికు చేదు అనుభవం ఎదురైంది. రూ.2.20 లక్షల ఫీజు బకాయి ఉందని, డబ్బులు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని కాలేజీ యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో దిక్కుతోచని స్థితిలో పడ్డ అతడు, చివరకు సమీప బంధువు వద్ద డబ్బు వడ్డీకి తెచ్చి కాలేజీలో చెల్లించాడు.

ప్రస్తుతం జిల్లాలో వేలాది మంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాయి. కొందరు విద్యార్థులు అప్పు చేసి ఫీజులు చెల్లిస్తుండగా.. స్థోమత లేని విద్యార్థులు సర్టిఫికెట్లను కాలేజీల్లోనే వదిలేస్తున్నారు. ఫలితంగా ఉద్యోగాలు పొందలేక, పై చదువులకు వెళ్లలేక సతమతమవుతున్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు..

ఫీజు రియింబర్స్‌మెంట్ వస్తుందనే పేద మధ్యతరగతికి చెందిన కుటుంబాల వారు వారి పిల్లలను పలు ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో చేర్పించారు. తీరా కోర్సు పూర్తి చేసుకున్నాకా సర్టిఫికెట్లు ఇచ్చే సమయానికి ప్రభుత్వం నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ రాలేదు కాబట్టి మీ సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని చెప్పటం ఎంత వరకు సమంజషం అని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. సర్టిఫికెట్లు లేక విద్యార్థులు ఏ కంపెనీలో ఉద్యోగాలు వచ్చినా చేరలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.



మెట్రిక్ విద్యలో కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ పథకం కింద చెల్లింపుల్లో సర్కారు తీవ్ర జాప్యం చేయడంతో విద్యార్థులు సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేసినా సర్టిఫికెట్లు పొందలేదు. ఫీజులు చెల్లించి ధ్రువపత్రాలు పొందాలని, లేకుంటే ప్రభుత్వం నిధులు విడుదల చేశాక తీసుకోవాలని కాలేజీలు తేల్చి చెబుతున్నాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో ప్రైవేటు యాజమాన్యాలే కీలకం. అరు లైన విద్యార్థులకు ప్రభుత్వమిచ్చే ఫీజులతోనే ప్రైవేటు కాలేజీలు నిర్వహిస్తున్నాం. కానీ రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రైవేటు కాలేజీల నిర్వహణ గుదిబండగా మారుతోంది. అటు విద్యార్థులను కోర్సు మధ్యలో పంపించలేక.. అప్పులు చేసి నిర్వహించలేక సతమతమవుతున్నాం. అరకొర ఫీజులిస్తూ నాణ్యత, ప్రమాణాలంటూ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని పలువురు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నారు.

చింతిర్యాలగూడెంలో వైద్య శిబిరం

మణుగూరు/ అశ్వాపురం మార్చి28: అశ్వాపురం మండలంలోని చింతిర్యాలగూడెం, సంద్రల బోడు గ్రామాల్లో వైరల్ ఫీవర్లతో ఇబ్బందులు పడుతున్న ఆదివాసీల దుస్థితిపై ఆంధ్రజ్యోతి గురువారం 'గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు' అనే వార్తను ప్రచురించింది. ఈకథనం పై స్పందించిన మండల వైద్య సిబ్బంది గురువారం ఉదయం చింతిర్యాలగూడెంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక వైద్య సిబ్బంది గ్రామంలో ప్రతి గడప తిరిగి జ్వరపీడితుల వివరాలను ఇతర సమస్యలతో ఇబ్బంది పడే వారి సమాచారాన్ని సేకరించింది. వైద్య శిబిరంలో జ్వర పీడితులను వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా రక్త నమూనాలను కూడా సేకరించారు. దోమల వ్యాప్తి కాకుండా నిల్వ నీరు లేకుండా సిబ్బంది ప్రతి ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వనీరును అందులో పెరిగే లార్వాను చూపి జ్వరాల వ్యాప్తి ఎలా జరుగుతుందో గిరిజనులకు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు సంకీర్తన మాట్లాడుతూ చింతిర్యాల గూడెం, సంద్రల బోడులో తమ సిబ్బంది సర్వేలను చేపట్టారని తెలిపారు. కొందరి రక్త నమూనాలను కూడా తీసుకున్నామన్నారు. గ్రామాల్లో ఒళ్లు నొప్పులతో బాధపడే వారు ఉన్నారని వారంతా ఎండల్లో పనులకు పోవడంతో జ్వరంతో ఇబ్బంది పడ్డారని తెలిపారు. అందరికీ వైద్య సేవలందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కౌన్సిలర్లను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మార్చి28: సత్తుపల్లి మునిసిపల్ కౌన్సిలర్లు చాంద్‌పాషా, నడ్డి జమలమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు తడికమళ్ల ప్రకాశరావులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. కౌన్సిలర్ చాంద్‌పాషాపై ఇటీవల కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరచడంతో ఆయనను వెంకటవీరయ్య పరామర్శించారు. చాంద్‌పాషా బీఆర్ఎస్‌కు పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కౌన్సిలర్ నడ్డి జమలమ్మను, కో-ఆప్షన్ ప్రకాశరావులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సండ్రతో పాటు మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్, ప్రవీణ్, గుండ్ర రఘు, బీఆర్ఎస్ నాయకులు దొడ్డా శంకరరావు, షేక్.రఫీ, ఆయూబ్‌పాషా, పవన్, మాధురి మధు, పర్వతనేని వేణు, మదీనాపాషా, ఎస్‌కే.జిన్నీ, కంటె అప్పారావు తదితరులు ఉన్నారు.


చాంద్‌పాషాతో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి రైతు దుర్మరణం

మధిరరూరల్, మార్చి 28: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ రోటరేటర్‌లో పడి ఓ రైతు మృతిచెందాడు. ఖమ్మంజిల్లా మధిర మండలం నిధానపురంలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. నిధానపురం గ్రామంలో అమరవాది నర్సిరెడ్డి(56) అనే రైతు కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని మిర్చి సాగుచేశాడు. ప్రస్తుతం మిర్చి పంటకాలం పూర్తికావడంతో చేనులోని మిర్చిచెట్లను తొలగించటానికి గురువారం ట్రాక్టర్‌కు రోటవేటర్‌ను తగిలించుకొని పొలానికి వెళ్లాడు. మిర్చిచెట్లను తొలగిస్తుండగా రోటవేటర్‌కు చెత్తను అడ్డపడడంతో దాన్ని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ రోటవేటర్‌లో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కొంతమైంది రైతులు ఈ విషయాన్ని గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరి చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

వేంసూరు, మార్చి 28: కొబ్బరి చెట్టుపై నుంచి ఓ యువకుడి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన సంఘటన వేంసూరు మండలం అమ్మపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన వేముల నాగరాజు(34)కొబ్బరికాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేంసూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగరాజు మృతదేహం

పేదల స్థలాలు ఆక్రమించిన వ్యక్తిపై కేసు

రఘునాథపాలెం, మార్చి 28: పేదలకు ఇచ్చిన స్థలాలను ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..రఘునాథపాలెం మండలంలోని పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో సర్వే నెంబర్ 192లో ఖమ్మం నగరంలోని నిరుపేదలకు, ప్రభుత్వ అవసరాలకు ఇళ్ల స్థలాలు తీసుకున్న బాధితులకు పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే కొన్ని ఆర్థిక ఇబ్బందులు, నివాసానికి కావాల్సిన వసతులు లేని కారణంతో లబ్ధిదారులు నివాసాలను ఏర్పాటు చేసుకోలేకపోయారు. ఇదే అదునుగా భావించిన ఇదే గ్రామానికి చెందిన కాంపాటి రవి పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో కొన్ని ఇళ్ల స్థలాలను ఆక్రమించి, వాటిని తిరిగి అమ్మకాలు జరిపారు. దీంతో బాధితులు స్థానిక తహసీల్దార్ లూధర్‌విల్సన్‌కు ఫిర్యాదు చేయడంతో, ఇళ్ల స్థలాల ఆక్రమణపై విచారించి అతడిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్తక సంఘం సభ్యుడు నాగేశ్వరరావు కన్నుమూత

ఖమ్మం వ్యవసాయం, మార్చి 28: ఖమ్మం వర్తక సంఘం దిగుమతి శాఖ సీనియర్ సభ్యుడు బోనగిరి నాగేశ్వరరావు గురువారం మృతి చెందారు. వర్తకసంఘం గౌరవ అధ్యక్షుడు మేళ్ల చెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నరసింహారావు, మన్నెం కృష్ణయ్య, తల్లాడ రమేష్‌లు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎం

● పాఠశాలలో ఎంఈవో విచారణ

మధిరరూరల్, మార్చి 28: మధిర సమీపంలోని ఓ గ్రామంలోగల ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం నలుగురు విద్యార్థినుల పట్ల ప్రవర్తించాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై గురువారం తల్లిదండ్రులు ఫోన్లో ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో ప్రభాకర్ ఆపాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని తల్లి మాట్లాడుతూ విద్యార్థినులను హెచ్‌ఎం అసభ్యకరంగా తాకడం చేస్తున్నారని, ఇంటికొచ్చి తల్లిదండ్రులకు చెప్పుకుంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పది పరీక్షల డ్యూటీ నిమిత్తం హెచ్‌ఎం వేరే మండలంలో పనిచేస్తున్నారని, హెచ్‌ఎంను విచారించలేదని తెలిపారు.

సత్తుపల్లి అటవీ ప్రాంతం పరిశీలన

సత్తుపల్లిరూరల్, మార్చి28: సత్తుపల్లి అటవీ ప్రాంతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఫారెస్ట్ విజిలెన్స్ అధికారులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని గొల్లగూడెం, చంద్రాయ్యపాలెం, జగన్నాథపురం, భవన్నపాలెం అడవులలో పర్యటించిన పెంచిన ప్లాంటేషన్ మొక్కలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో డీఎఫ్‌వో రాజశేఖర్, ఎఫ్ఆర్‌వో నరేంద్ర, ఎఫ్ఎస్‌వో హుస్సేన్, సత్తుపల్లి రేంజర్ స్నేహలత, శిల్ప, అరుణ, బంగారం, నాజుర్‌బీ ఉన్నారు.


కాలిబాటను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మావోయిస్టు డిప్యూటీ కమాండర్, కొరియర్ అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు 151 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్, 204 బెటాలియన్ కోబ్రా పోలీసులు గురువారం మావోయిస్టు పార్టీ కిష్టారం ఎల్ఓఎస్ డిప్యూటీ కమాండర్, ఒక మావోయిస్టు కొరియర్‌ను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలీసు బలగాలు దుమ్ముగూడెం మండలం ములకనపల్లి అటవీ ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త కూంబింగ్ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీ కిష్టారం ఎల్‌వోఎస్ దళ డిప్యూటీ కమాండర్ పుట్టం మున్నా అలియాస్ సన్నాల్, మావోయిస్టు పార్టీ కొరియర్‌గా పనిచేస్తున్న జాడి పెద్దబ్బాయిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో పుట్టం మున్నాది ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూస్నార్ గ్రామం కాగా జాడి పెద్దబ్బాయి ములుగు జిల్లా వెంకటాపురం వీరాపురం గ్రామానికి చెందినవాడని తెలిపారు.

పుట్టం మున్నా అలియాస్ సన్నాల్ 2004 నుంచి మావోయిస్టు పార్టీ అయుధ దళ సభ్యుడిగా పనిచేస్తున్నాడని, 2004-2006 కాలంలో గంగలూరు ఏరియా మిలీషియా సభ్యుడిగా, 2006-07లో గంగులూరు ఏరియా కమిటీ దళ సభ్యునిగా, 2007-2011 మధ్యకాలంలో పామేడు ఏరియా కమిటీ దళ సభ్యుడిగా, 2011-22లో మడవి హెడ్మా అలియాస్ సంతోష్ నాయకత్వంలో మావోయిస్టు బెటాలియన్ సభ్యుడిగా పని చేశాడన్నారు. 2022లో ఎసీఎంగా పదోన్నతి పొంది ఇప్పటి వరకు కిష్టారం ఏరియా ఎల్‌వోఎస్ డిప్యూటి దళ కమాండర్‌గా పని చేస్తున్నారని వివరించారు. ఎస్ఎల్ఆర్ ఆయుధాన్ని కలిగి ఉండి ఇతర మావోయిస్టు దళ సభ్యులతో కలిసి అనేక విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నాడన్నారు. 2007లో తాడిమెట్ల దగ్గర మాటు వేసి 12మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి చేసి హతమార్చిన ఘటనలో పుట్టం మున్నా పాల్గొన్నాడని తెలిపారు. 2010లో చింతల్నార్ అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులపై కాల్పులు జరిపి 76మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటనలో, 2014లో మైన్‌ప్రూఫ్ వాహనంపై కాల్పులు జరిపి 9మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటనకు ఇతడు సూత్రదారి అన్నారు. 2021 జిరామ్ ఘాట్ సంఘటనలో 22మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటనలతో పాటు ఇటీవల ఏర్పాటు చేసిన ధర్మారం క్యాంపుపై దాడి వంటి ఘటనల్లోనూ ఇతడు పాల్గొన్నారని, ఇతడిపై ఛత్తీస్‌గఢ్‌లో రూ.5లక్షల రివార్డు ఉందని వివరించారు. ఇక మావోయిస్టు కొరియర్ జాడి పెద్దబ్బాయి గత మూడు సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్‌లోని 1వ బెటాలియన్ మావోయిస్టులకు కొరియర్‌గా పని చేస్తున్నాడని ఎస్పీ తెలిపారు. ఈ ఇద్దరు నిందితుల నుంచి ఒక బ్యాగు, పది జిలెటిన్ స్టిక్స్, రెండు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, మావోయిస్టు కరపత్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీకి ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ సహకరిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్‌రాజు హెచ్చరించారు.


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్

ఇల్లెందుటౌన్‌చ మార్చి 28: ఇల్లెందు బార్ అసోసి యేషన్ అధ్యక్షుడిగా భూక్య రవికుమార్ నాయక్ ఎన్నిక య్యారు. గురువారం స్థానిక కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం భుక్యా రవికుమార్ నాయక్, పెద్దూరి నర్సయ్య, పలుపులేటి యాకయ్యలు పోటీ పడగా రవికుమార్ 25 ఓట్లు పొంది విజయం సాధించారు. ఎన్నికైన బార్ అసోసియేషన్ కమిటీని సివిల్ కోర్టు జడ్జి దెవరపల్లి చంద్రికరెడ్డి అభినందించారు. జనరల్ సెక్రటరీగా కాంపెల్లి ఉమామహేశ్వరావు, జాయింట్ సెక్రటరీగా కీర్తి, కార్తీక్, కోశాధికారిగా నవీన్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మామిడి సత్యప్రకాష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మల్లికార్జున్‌రావు, చెన్నకేశవ రావు, శ్రీనివాస్, కరుణాకర్, ఆనంద్, పాల్గొన్నారు.


నూతన కమిటీని అభినందిస్తున్న జడ్జి చంద్రికరెడ్డి

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి28: నగరంలోని ఖానాపురం పరిధిలోని వైఎస్సార్‌కాలనీ సమీపంలో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, నగరపాలకసంస్థ అధికారులు గురువారం తొలగించారు. సర్వేనెంబర్ 37లో సుమారు 35 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, 2004, 2009 సంవత్సరాల్లో 300మంది మాజీ సైనికులకు, 139మంది స్వాతంత్ర్య సమరయోధులకు మొత్తం 439మందికి 144 గజాల వంతున అప్పటి కలెక్టర్లు అందజేశారు. వారికి అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. అయితే ఆయా స్థలాల్లో చాలామంది ఇళ్లు నిర్మించుకోలేదు. కొందరు స్థలాలు విక్రయించారు. స్థలాలు కొన్నవారు, ఆక్రమించిన వారు ప్రభుత్వస్థలంలో నిర్మాణాలు చేపట్టారు. కలెక్టర్ గౌతమ్ అసైన్డ్ స్థలాలపై దృష్టి పెట్టి అక్రమ నిర్మాణాలు కూల్చివేసి, స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించటంతో రెవెన్యూ అధికారులు సర్వేనెంబర్ 37లో మాజీ సైనికులకు ఇచ్చిన స్థలాలపై విచారణ జరిపారు. అక్కడ అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించి, గురువారం 20 బేస్‌మెంట్ నిర్మాణాలను, 20షెడ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా అర్బన్ తహసీల్దార్ సీహెచ్. స్వామి మాట్లాడుతూ అసైన్డ్ స్థలాలు నిరుపయోగంగా ఉండటంతో వాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతరులకు విక్రయించటం చట్టరీత్యా నేరమన్నారు. 25 ఏళ్లుగా అసైన్డ్‌స్థలాలు నిరుపయోగంగా ఉండటంతో వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవటానికి కలెక్టర్ ఆదేశానుసారం చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా సర్వేనెంబర్ 37లో అక్రమ నిర్మాణాలను తొలగించి, స్థలాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ స్థలాలపై అభ్యంతరాలు ఉన్నవారు తమ వద్ద నున్న ఒరిజనల్ పట్టాలతో సంప్రదించాలని తహసీల్దార్ పేర్కొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నేలకొండపల్లి, మార్చి28: మండల పరిధిలోని అప్పలనర్సింహాపురం వద్ద గురువారం ద్విచక్రవాహనం ఆటోను ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. సదాశివపురానికి చెందిన కూలీలు గురువారం ఉదయం అప్పలనర్సింహాపురం గ్రామంలో మిరపకాయలు వేరేందుకు వెళ్లి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా, అప్పలనర్సింహాపురం-రాయగూడెం మధ్య చెర్వుమాధారం వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అగ్రేషమ్మ, మమత, రమలు గాయపడ్డారు. ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఖమ్మం తరలించారు.

వైరా: వైరాలో గురువారం జాతీయ ప్రధాన రహదారిపైన పెట్రోల్ బంక్ వద్ద వైరా నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో వెంకటేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108వాహనంలో ఖమ్మం తరలించారు.

'బూటకపు ఎన్నికలను బహిష్కరించండి'

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరిట లేఖ

మణుగూరు/పినపాక, మార్చి 28: "బ్రాహ్మణీయ హిందుత్వ పాసిస్టు భారతీయ జనతాపార్టీని తన్నితరమండి.. బూటకపు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించండి" అంటూ సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో గురువారం మీడియాకు లేఖ విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పాలక పక్షాలు ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో అధికారం కోసమే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే 'ఇండియా' కూమలు ఎన్నికల్లో పోటీపడుతున్నాయి తప్ప ప్రజల ప్రయోజనాలకోసం కాదని విమర్శించారు. 2019లో పుల్వామా సంఘటనను సృష్టించి బీజేపీ హిందూమతోన్మాదాన్ని, జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకుందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ కార్పోరేట్ శక్తులకు నమ్మిన బంటులా పనిచేశాడని విమర్శించారు. దేశంలోని 70శాతం జనాభాకు పౌష్టికాహారం అందడం లేదని, నిరుద్యోగం, కొనుగోలు శక్తి లేదని పేర్కొన్నారు. అందుకే బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని, బీజేపీతో పాటు దాన్ని అంటకాగే పార్టీలన్నింటినీ తన్ని తరమాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. విప్లవ ప్రజారాజ్యాధికార సంస్థలో చేరి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిజాన్ని నిర్మించుకోవాలని ఈ లేఖ ద్వారా మావోయుస్టు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

విధులకు రానివ్వడం లేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొణిజర్ల, మార్చి28: విధులకు రానివ్వడం లేదని పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో అంజనాపురంలో జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా ప్రసాద్ కొంత కాలంగా పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం పంచాయతీ కార్యదర్శి తనను విధులకు రానివ్వడం లేదని, రెండు నెలలు నుంచి వేతనం ఇవ్వడం లేదని సెల్ఫీవీడియోలో పేర్కొన్నాడు. తనను పూర్తిగా విధులను తొలగించి వేరేవారిని నియమించాలని చూస్తున్నారని ఆరోపించాడు. తనను విధులకు రానివ్వకపోవడంతో అవమానంగా భావిస్తున్నాని పురుగుల మందు తాగుతున్న వీడియో విడుదల చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సురేష్‌ని వివరణ కోరగా..భూక్యా ప్రసాద్ విధులకు సక్రమంగా రాడని, వచ్చిన రోజు కూడా మద్యం సేవించి వస్తాడని, ఆ భయంతో దూరంగా ఉంచాల్సి వచ్చిందని తెలిపారు. జనవరిలో ఐదు రోజులు, ఫిబ్రవరిలో ఎనిమిది రోజులు, మార్చిలో రాలేదని తెలిపాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి అతను తీసుకెళ్లాడని, సార్ కూడా ఫోన్ చేయడంతో శుక్రవారం గుడ్‌ఫ్రైడే కావడంతో శనివారం రమ్మని చెప్పానని పేర్కొన్నారు. మద్యం సేవించి వస్తే ప్రమాదం జరుగుతుందోమోనని తప్ప తన మీద తనకు ఎటువంటి దురుద్దేశంలేదన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చుంచుపల్లి, మార్చి28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో బాబుక్యాంపు పంచాయతీలో మనోహర్(45) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. అతడి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టు పక్కల ఇళ్ల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆడబిడ్డంటే.. కడుపులోనే కరగదీస్తున్నారు

» ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అక్రమంగా అబార్షన్లు » జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీ » ఆసుపత్రి సీజ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 28: ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎటువంటి అనుమతు లేకుండానే, నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడపిల్లయితే కొందరు తల్లిదండ్రులు కడుపులో నే కరగదీస్తున్నారు. అందుకు కాసులకు కక్కుర్తి పడే ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యాలు సహకరిస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు బరి తెగించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్లని తేలితే అబార్షన్లు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. ఇక్కడ ఏళ్ల తరబడి ఈ తతంగం కొనసాగుతోంది. ఒక్కో అబార్షన్‌కు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు వసూలు చేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేయడంలో వైద్యుల పాత్రపై కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఖమ్మం నగరంలోని బోనకల్ రోడ్డు సమీపంలోని ఓ ఆస్పత్రిలో గురువారం ఉదయం నుంచి అబార్షన్లు చేస్తున్నారంటూ కలెక్టర్ గౌతమ్‌తో పాటు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సదరు ఆస్పత్రిపై గురువారం రాత్రి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు దాడి చేశారు. ఆస్పత్రిలో ఉదయం నుంచి ఐదుగురికి ఆపరేషన్లు చేయగా మరోఇద్దరికి అబార్షన్ చేసేందుకు సిద్ధం చేశారు. దీంతో రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడంతో అధికారులు విచారణ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి ఆధ్వర్యంలో బృందం 50 కేషీట్లు పరిశీలించింది. కేషీట్లలో నమోదు చేసినట్లుగా పేషంట్లకు కడుపునొప్పి ఇతర కారణాలు చూపించి చేర్పించుకుని అబార్షన్లు చేస్తున్నట్టు పరిశీలనలో తేలినట్లు డీఎంహెచ్‌వో వివరించారు. కరీంనగర్, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఇతర జిల్లాలకు చెందిన వారికి ఇక్కడ అబార్షన్లు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కే షీట్‌లోనూ ఆస్పత్రి వర్గాలకు ప్రత్యేక కోడ్‌తో రాసి ఉంచడంతో వీటిపై ప్రశ్నించగా సమాధానం చెప్పకపోవడంతో ఇంకా లోతుగా విచారణ చేపట్టాల్సి ఉందన్నారు. ఆసుపత్రిలోని డాక్టర్ కేవలం ఎంబీబీఎస్ మాత్రమేనని, వీరు సాధారణ వైద్యపరీక్షలు చేయవచ్చు కానీ ఎంటీపీ(మెడి కల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీకి)కి ఎలాంటి అనుమతులు లేవన్నారు. అబార్షన్లు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో ఆస్పత్రిలో సీసీ పుటేజీ, స్కానింగ్ మిషన్, కంప్యూటర్లుతో పాటు ఆస్పత్రిని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ అనంతరం ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న రోగులను ఖమ్మంప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, శిక్షణ కలెక్టర్ యువరాజ్, శిక్షణ పోలీస్ అధికారి మౌనిక తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు

చెరువు మట్టి తవ్వకాలపై
అధికారుల విచారణ

» ప్లాట్‌గా చేసిన ప్రదేశంలో పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, మార్చి 28 మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువుల్లో మట్టి తవ్వకాలు జరపుతున్న విషయమై 'ఆంధ్రజ్యోతి'లో 'చెరువుల్లో హాంఫట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై గురువారం జలవనరులశాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. మండలంలోని చెన్నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల రావికంపాడు గ్రామంలో గల గురువిశెట్టికుంట చెరువు నుంచి ఇటీవల ఓ నాయకుడు చెరువులో మట్టిని వరి పొలంలో వినియోగించే పేరుతో ఎర్ర మట్టి గ్రావెల్‌ను టాక్టర్ల ద్వారా తోలుకోవటమే కాక చెన్నూరు ప్రధాన రహదారి ప్రక్కన గల తన సొంత ప్లాట్లలో మెరక చేశాడు. దీనిపై జలవనరుల శాఖ ఇంజినీర్ పద్మరాజ్ తన సిబ్బందితో సదరు ప్రదేశంలో చేరుకుని ఏ మేరకు గ్రావెల్ మట్టిని తోలించారన్న అంశంపై సాంకేతికంగా కొలతలు వేసి అంచనా వేశారని తెలిసింది. చెరువు పరిధిలో మట్టి త్రవ్వకాలు ఎలా జరుపుతున్నరన్న విషయమై సమగ్ర విచారణ కూడ జరపినట్లు తెలిసింది. కల్లూరు డివిజన్ జలవనరుల శాఖ ఈఈ లక్ష్మీనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతుల పంట పొలాల చదును, భూసారం కై మాత్రమే కొంతమంది రైతులు దరఖాస్తులు చేసుకోగా మట్టి తవ్వకాలకు అనుమతించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన గ్రావెల్ మట్టి తవ్వి ఇతర భూముల్లో, లేదా ప్లాట్‌ల కోసం వినియోగిస్తే విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికే తమ శాఖ తరుపున మట్టి తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంట పొలాల పేరుతో మట్టిని దుర్వినియోగం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బాండ్ల నగదు చెల్లింపులో జాప్యమెందుకు?

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 28: ఖమ్మం ఆర్టీసీ యాజమాన్యం కార్మికుల పట్ల వివక్ష ధోరణి అవలభిస్తుందని, బాండ్లకు సంబందించి నగదు చెల్లింపుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పేర్కొన్నారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బాండ్లకు సంబందించి 40 రోజుల క్రితమే డబ్బులు మంజూరు చేసిందని, అయినా కార్మికులకు నగదు ఎందుకు చెల్లిం చటంలేదని ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించ కుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ పై కేసు నమోదు

ఖమ్మం క్రైం మార్చి 28: ద్విచక్ర వాహనాన్ని గుర్తుతె లియని వ్యక్తి చోరీచేసని సంఘటనపై గురువారం రాత్రి ఖమ్మం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గాంధీ చౌక్ లోని ఓ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనంను నిలిపి బయటకు వెళ్లాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి ఆ ద్విచక్ర వాహనంను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం సదరు వ్యక్తి కూసుమంచిలోని ఓ పెట్రోల్ బంక్‌లో రూ.10వేల నగదును కూడా చోరీ చేశాడు. ఈ ఘటనపై ద్విచక్ర యజమాని ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు నిందితునికోసం గాలిస్తున్నారు.

జన సంద్రంలోకి వనదేవతలు

» డోలు వాయిద్యాలతో మార్మోగిన చొప్పాల
» అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కరకగూడెం, మార్చి 28: మండలంలోని చొప్పాల పంచాయతీలోని ముసలమ్మ ఆలయంలో గురువారం జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం మండె మెలుగు నుంచి మొదలైన జాతర బుధవారం ఒక్క పొద్దు నిర్వహించారు. గురువారం నిండు జాతర సందర్భంగా ముసలమ్మగుట్ట నుంచి పూజారులు వనదేవతను భక్తి శ్రద్ధలతో తీసుకొస్తున్న మార్గం మధ్యలో 2 గంటల సమయంలో పూజారులు వనదేవతలకు ఎదురుకోలు నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయాలు, డోలు వాయిద్యాలు, నృత్యాలు, పూనాకాలతో జన సంద్రంలో ముసలమ్మ ఆలయం వద్ద గద్దెలపై వనదేవతలను కొలువు తీర్చారు. అనంతరం భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. భక్తులకు దేవర బాలలు (పూనకాలతో భక్తుల కోర్కెలు తీర్చు) తాటి లక్ష్మి, తోలెం అణసూర్య తీర్థ ప్రసాదాలను అందజేశారు. కరకగూడెం ఎస్‌ఐ జీవన్ రాజు ఆధ్వర్యంలో కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


వనదేవతలను గుడికి తీసుకోస్తున్న దృశ్యం

గద్దెలపైకి చేరిన ఇలవేల్పులు

» దేవతల రాకతో జన సంద్రమైన నిండు జాతరలు..
» దూలుగొండ ముసలమ్మ,
లక్ష్మిదేవతలకు భక్తుల నీరాజనాలు

గుండాల, మార్చి 28: ఈసం వంశీయుల ఆరాధ్య దైవం దూలుగొండ ముసలమ్మ దేవత వనం నుంచి గద్దెలపైకి చేరడంతో నిండు జాతర మొదలైంది. రోళ్లగడ్డ గ్రామంలో ఈసం వంశీయులు దూలుగొండ ముసలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మండల మెలుగుట, గుడి మెలుగుట కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించి గురువారం అమ్మవారిని వనం నుంచి తిసుకువచ్చి గద్దెలపై ప్రతిష్టించారు. దేవతను తీసుకువచ్చే క్రమంలో భక్తులు డోలీ వాయిద్యాలతో గిరిజన నృత్యాలు చేశారు. శుక్రవారం దేవతలు వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసం క్రిష్ణ, భిక్షం, సమ్మయ్య, కన్నయ్య, రాంమూర్తి, శేఖర్, మల్లయ్య, పాపారావు, ఎర్రయ్య, నారాయణ, పాపమ్మ, నర్సయ్య, సత్యం, పొట్టయ్య, సింగన్న, రామయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


దేవతల వేశధారణలో పూజారుల ఊరేగింపు

ఘనంగా లక్ష్మీదేవి జాతర ..

జోగ వంశీయుల ఇలవేల్పు శ్రీ లక్ష్మీదేవి దేవత గుడి ప్రవేశంతో తూరుబాక గ్రామంలో గురువారం నిండు జాతర ప్రారంభమైంది. వడ్డెలు(పూజారులు) లక్ష్మీదేవి, పోతురాజు వేశదారణలతో డప్పు వాయిద్యాలు, కోలాటాలు, కొమ్ము డ్యాన్సులు, ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో గ్రామంలో వీదులగుండా ఊరేగింపు నిర్వహించారు. తూరుబాక, ముత్తాపురం, పడుగోనిగూడెం, వేపలగడ్డ గ్రామాల్లో జోగు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు జోగ దమ్మయ్య జోగ పెద్దజోగయ్య, బుచ్చయ్య, చిన్న నర్సయ్య, జోగ భద్రయ్య, జోగ పోతయ్య, జోగ లక్ష్మయ్య, ఈసం లింగయ్య, వడ్డెలు యాప సందయ్య, బాలయ్య గ్రామస్తులు గొగ్గెల లక్ష్మినారా యణ, కాంతారావు, యదల్లపల్లి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.


గద్దెలపైకి చేరిన దూలుగొండ ముసలమ్మ అమ్మవారు

గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

ఖమ్మం రూరల్, మార్చి 28: మండల పరిదిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలను న్యాక్ బృందం గురువారం సందర్శించింది. కళాశాలరి కార్డులను, రిజిస్టర్ లను పరిశీలించారు. కళాశాలలో న్యాక్ కి సంబంధించిన అంశాలను పరిశీలించి ఆధ్యాపకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ సాధించడానికి చేపట్టాల్సిన అంశాలను, విషయాలను వివరించారు. న్యాక్ బృందంలో ఖమ్మం లోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్యాపకులు సత్యవతి, బండి వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురుకుల కళాశాలలో న్యాక్ బృందం

పనుల పురోగతిపై నివేదిక అందజేయాలి: పీవో

భద్రాచలం, మార్చి 28: గిరిజన గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతి సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి దానికి సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన ఐటీడీఏ కార్యాలయానికి అందజేయాలని పీవో ప్రతీక్‌జైన్ డీఈ, ఏఈలకు ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇంజనీరింగు ద్వారా వివిధ రకాలైన పనుల గురించి ముందుగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలకు సంబంధించి అలాగే ఇంజనీరింగు సంబంధించిన ఇతర పనుల గురించి ఆయన సమీక్షించి పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు ఇప్పటికే కేటాయించినందున సాధ్యమైనంత తొందరగా గిరిజన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలలో మైనర్ రిపేర్స్ ఉంటే వెంటనే చేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఈఈ గిరిజన సంక్షేమ శాఖ తానాజీ, ఎస్వో సురేష్‌బాబు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న పీవో

సమన్వయంతో ముందుకుసాగాలి

● ఖమ్మం సీపీ సునిల్‌దత్, ఏలూరు ఎస్పీ మేరిప్రశాంతి

ఖమ్మం క్రైం, మార్చి 28: సమష్టి కృషి, సమాచార మార్పిడితో లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్, ఏలూరు ఎస్పి డి.మేరిప్రశాంతి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్‌రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో అక్రమరవాణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఖమ్మం, ఏలూరు జిల్లాల పోలీసుల అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్, ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర అంతర్ జిల్లా పోలీసు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో 24/7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా సమన్వయంతో ముందుకువెళ్లాలని సూచించారు. సరిహద్దుల్లో పటిష్ట నిఘా పెట్టడంతో పాటు అక్రమ మద్యం, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.

అదేవిధంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణను నియంత్రించాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పాత దొంగలు, నేరస్తుల సంచార కట్టడి, ఇంటిలిజెన్సు సమాచారం పంచుకోవడం తదితర అంశాలపై చర్చించారు.

రౌడీషీటర్లతో పాటు గతంలో అక్రమరవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని సూచించారు. పోలీసు అధికారులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, కల్లూరు ఏసీపీ రఘు, స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ ప్రసన్నకుమార్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచందర్, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సరిహద్దు పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

» అధికారుల సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 28: రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ఏఎల్ఎంటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12ని వినియోగించుకోవాలన్నారు. దీనికోసం సీఈఓ కార్యాలయం వెబ్‌సైట్‌లో పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించిన వివరాలను ఎన్ఐసీ ద్వారా పొందుపరిచి పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలను పొందుపరిచే బాధ్యత కార్యాలయ అధికారి, నోడల్ అధికారిదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. మే 6 వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తారన్నారు. ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 అందించి జిల్లాలో అత్యధికం గా ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్ అధికారు లను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాం క్ సింగ్, యువరాజ్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వ రి, ఖమ్మం, కొత్తగూడెం ఆర్‌డీవో గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఔషధాల అక్రమ నిల్వలపై దాడులు

» రూ. 2లక్షల విలువైన మందుల సీజ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి28: ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లలో నిల్వ ఉంచి మందులు విక్రయిస్తున్న వారిపై ఔషధ తనిఖీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఖమ్మం ఔషధతనిఖీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలో ఈసాల రాజు అనే వ్యక్తి తన ఇంట్లో అనుమతులు లేకుండా మందులను నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే సమాచారాన్ని అందుకున్నారు. ఈనేపథ్యంలో ఆ వ్యక్తి ఇంటిపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 75 రకాల అల్లోపతి మందులను గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 75 రకాల అల్లోపతిక్ డ్రగ్స్ (అధిక యాంటీబయాటిక్స్, హేబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ మరియు స్టెరాయిడ్స్‌తో సహా) విక్రయిస్తుండడంతో వాటిని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై సెక్షన్ 18(సి)ని ఉల్లంఘించినందుకు డ్రగ్స్ , కాస్మెటిక్స్ చట్టం 1940 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఖమ్మం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రెడ్డి, ఖమ్మం రూరల్ డీఐ.సంపత్ కుమార్, కొత్తగూడెం డీఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని ఏడీ ప్రసాద్ విలేకరులకు తెలిపారు. ఆర్ఎంపీలు కానీ ఇతర వ్యక్తులు అనుమతులు లేకుండా మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రసాద్ హెచ్చరించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

సరిహద్దులు కట్టుదిట్టం చేయాలి

» ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జానారెడ్డి

బూర్గంపాడు, మార్చి 28: లోకసభ ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాల బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద భద్రతను పటిష్టం చేసి అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జానారెడ్డి ఆదేశించారు. భద్రాద్రి జిల్లా సారపాక ఐటీసీ పేపర్‌బోర్డు ప్రాంగణంలో గురువారం జరిగిన కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇంటర్ బోర్డర్ కో-ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి అక్రమంగా మద్యం, గంజాయి, నాటుసారా రవాణా జరగకుండా ఆయా రాష్ట్రాల ఎక్సైజ్‌శాఖ అధికారుల సహకారంతో పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జానారెడ్డి

అందులో భాగంగానే పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వద్ద తాత్కాలిక చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న చెక్ పోస్టులను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సూర్యచందర్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గజేందర్, బీజాపూర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాథోడ్, అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరం చంద్, భద్రాచలం ఎస్‌హెచ్‌వో రహిమున్నిసాబేగం, కొత్తగూడెం డీటీఎఫ్ సీఐ సాంబమూర్తి, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ పట్టాభి, చింతలపూడి ఎస్ఈబీ సీఐ ప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

భద్రాద్రినుంచి త్రీ స్టాప్ సర్వీసులు ప్రారంభం

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం నుంచి ఖమ్మానికి త్రీస్టాప్ డీలక్స్ బస్ సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. భద్రాచలం నుంచి ఖమ్మం, అలాగే ఖమ్మం నుంచి భద్రాచలానికి పాల్వంచ, కొత్తగూడెం, ఏన్కూరుల్లో బస్సులు మూడు స్టాఫ్‌ల్లో బస్సులు ఆగనున్నాయి. ఇందుకు సంబంధించిన సర్వీసులు అధికారికంగా ప్రారంభించారు. కాగా ఈ బస్సుల్లో ఆధార్‌కార్డుతో మహిళల ఉచిత ప్రయాణకి అనుమతి లేదని పేర్కొన్నారు.



బస్‌సర్వీస్ ప్రారంభిస్తున్న అధికారులు

చెరువు శిఖం భూమి ఆక్రమణ

» తగ్గుతున్న ఎఫ్‌టీఎల్ సామర్థ్యం
» అధికారుల సహకారంతో భూములకు పట్టా
» ఫిర్యాదు పట్టించుకోని సంబంధిత అధికారులు

కల్లూరు, మార్చి 28: కల్లూరు మండలంలోని పాయాపూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని పెద్దచెరువు (ఊరచెరువు) పరిధిలో మునక భూమిపై కబ్జాదారులు కన్నేసి చెరువు భూమిని ఆక్రమించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ చెరువు భూమి కొంతమంది ఆక్రమించటమే కాక మరి కొం తమంది చెరువు పరిధిలో గల సర్వే నెం 242 ప్రకారం సుమారు 50 ఎక రాల భూమితో పదిమంది వ్యక్తులు ఆక్రమంగా పట్టాదారు పాస్ పుస్తకా లు పొంది ప్రభుత్వం తరుపున రైతుబంధు సహాయం కూడా పొందు తున్నారని సమాచారం.

ఇలా గత ఎనిమిది సంవత్సరాల క్రితం అప్పటి తహసిల్దార్, మరో వీఆ ర్వో కలిసి ఈ పాస్‌పుస్తకాల జారికి కీలక పాత్ర వహించారని సమాచారం. సదరు చెరువు పరిధిలో 107 ఎకరాల భూమి విస్తీర్ణం (ఎఫ్‌టీఎల్) కలిగి ఉంది. ఇంకాను అదనంగా మరో 30 ఎకరాల భూమి కూడ ఉంది. చెరువు పరిధిలో పట్టా భూమి కలిగిన వారు కాలక్రమంలో పక్కన గల మునక భూమిని కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. ఇలా మరి కొంతమంది వ్యక్తులు ఇప్పటికే చెరువు మునక భూమని ఆక్రమించి మట్టి తోలకాలు జరిపి సాగుకు వినియోగంలోకి వచ్చేలా మెరక భూమిగా మార్చారు. మరికొంత మంది ఆక్రమించిన భూమిని పొలాలుగా, చెరువులోపల గల మునక భూమిని కబ్జా చేసి చేపల పెంపకానికి మినీ చెరువు కూడా చేశారు. ఇలా చెరువు మునక భూమి సుమారు 15 నుంచి 20 ఎకరాల వరకు కబ్జాదారుల చేతిలో ఉంది. ఈ నేపద్యంలో చెరువు ఎఫ్‌టిఎల్ సామర్థ్యం తగ్గిపోవటమే కాకుండ సాగునీటి అవసరాలకు చెరువు మనుగడ ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.


చెరువు శిఖం భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి పెన్సింగ్ వేసిన దృశ్యం

ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

చెరువు మనుగడ ప్రశ్నార్ధకంగా మారటంతో ఆయక ట్టు రైతులు, మత్స్యకార సంఘాల సభ్యులు గత ఫిబ్రవరి 15న ఆర్డీవో, తహసిల్దార్, జలవనరులశాఖ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇంకాను చెరువు శిఖం భూమిని కొంత వరకు కబ్జా చేసి మరో వ్యక్తి పెన్సింగ్ వేయటంతో దానిని తొలగించాలని, మునక భూమిని మెరక భూమిగా మారే ్లా మరో వ్యక్తి మట్టి తోలకాలు జరుతుండగా రైతులు అడ్డుకున్నారు. ఇలా అధికారులకు ఫిర్యాదు చేసిన నేటి వరకు చెరువు ప్రదేశంపై క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. చెరువుల సంరక్షణ బాధ్యత అధికారులపై ఉందని ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఆదేశించారు. కాని నేటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవటం పట్ల పలు అనుమానా లకు తావిస్తుంది. ఇంకాను కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి, చెన్నూరు, కల్లూరు తదితర గ్రామాల్లో చెరువుల భూమిని చాల వరకు కబ్జా చేయటంతో భవిషత్తులో వాటి మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది.


మునక భూమిని మెరక భూమిగా మార్చేందుకు మట్టి తోలిన దృశ్యం

చెరువు భూమికి పాసుపుస్తకాలు ?

ఈ చెరువు పరిధిలో సర్వే నెంబరు 242 ప్రకారం గల 50 ఎకరాల భూమిని సుమారు పది మంది వ్యక్తులు అక్రమంగా రెవెన్యూశాఖ తరుపున పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడ పొందినట్లు సమాచారం. ఇలా గత ఎనిమిది సంత్సరాల క్రితం నాటి తహసిల్దార్, మరో వీఆర్వోలు కలిసి పాయాపూరు గ్రామంలో కొంతమంది పెద్దమనుషులతో ములాఖత్ అయి అక్రమ పాస్‌పుస్తకాల దందాకు కీలక పాత్ర వహించారని తెలిసింది. అదే చెరువు భూమిలో అప్పటి విఆర్వో కూడా తన కుటుంబ సభ్యుల పేరుతో 5 ఎకరాల చెరువు భూమిపై పట్టాదారు పాస్‌పుస్తకం పొందటమే కాకుండా నేటి వరకు సదరు వీఆర్వోతో పాటుగా మరి కొంతమంది కూడ రైతుబంధు సహాయం పొందుతున్న విషయం వెలుగులోకి వచ్చింది.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం
సాంబశివుడు, తహసీల్దార్, కల్లూరు

పాయాపూరు పెద్దచెరువు (ఊరచెరువ) మునక భూమి అక్రమణకు గురైన విషయం నా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో చెరువు ప్రదేశంపై తమ శాఖ తరుపున సమగ్ర విచారణ జరపి తదుపరి చర్యలు తీసుకుంటాం. అక్రమంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు జారి విషయంపై కూడ విచా రణ చేసి చర్యలు తీసుకుంటాం. చెరువు ప్రదేశం లో సర్వే చేసి ఎఫ్‌టిఎల్ హద్దులు నిర్ణయించే విషయమై జలవనరులశాఖతో చర్చించాం. జలవనరులశాఖ డీఈ రత్నాకర్ వివరణ ఇస్తూ త్వరలో చెరువు ప్రదేశంపై సర్వే కార్యక్రమం చేపడ్తామని వివరించారు.

ఎన్నికల సిబ్బందికి రెండు రోజుల శిక్షణ: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28: లోకసభ 2024 ఎన్నికల విధులకోసం ఎంపిక చేసిన సిబ్బందికి ఏప్రిల్ 1, 2 తేదీల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలం నియోజకవర్గానికి చెందిన సిబ్బంది పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో, పినపాక నియోజకవర్గానికి చెందిన సిబ్బందికి పాల్వంచ అనబోసు ఇంజనీరింగ్ కాలేజీలో, అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన సిబ్బందికి పాల్వంచ డీఏవి పాఠశాల కేటీపీఎస్ కాలనీలో, కొత్తగూడెం నియోజవర్గానికి చెందిన సిబ్బందికి కొత్తగూడెం సింగరేణి మహిళా కాలేజీలో, ఇల్లెందు నియోజకవర్గానికి చెందిన సిబ్బందికి లక్ష్మీదేవిపల్లి శ్రీ రామచంద్ర ఆర్ట్ అండ్ సైన్స్ కాలుజీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కేంద్రంలోనే పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12లో విధిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆర్డర్ కాపీ, ఈపీఐసీ కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

మరో భగీరథ యత్నం

- తగ్గుతున్న గోదావరి నీటి పాయ
- ఎదురవనున్న దాహార్తి సమస్య
- ముందస్తు చర్యలకు పూనుకున్న అధికారులు
- పర్ణశాల నీటి పాయ మళ్లింపునకు కసరత్తు

మణుగూరు, మార్చి 28: ఎండాకాలం వచ్చింది ఇంకేముంది ప్రతి యేటా మణుగూరు మునిసిపాలిటీ ప్రజలు దాహం కోసం కొన్నిరోజులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొనబోతున్నాయి. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని అనేక గ్రామాలతో పాలు పలు పంచాయతీ గ్రామాలకు కూడా తాగు నీటిని అందించే మంచినీటి పథకం మునిసిపాలిటీ పరిధిలోని చిన్నరావిగూడెం గ్రామ శివారున ఉన్న గోదావరి ఒడ్డున ఉంది. ఇక్కడి గోదావరి ప్రవాహాలు ప్రతి వేసవిలో తగ్గుముఖం పడుతుంటాయి. ప్రతి యేటా కూడా స్థానిక అధికారులు భగీరథ ప్రయత్నాలు సాగించి దాదాపు నెల రోజుల పాటు శ్రమించి గోదావరి నీటి పాయలను మంచినీటినందించే ఇన్‌టేక్ వెల్ వరకు మళ్లించే పనులను చేస్తుంటారు. ఆ తర్వాత వర్షాలు, వరదల రావడంతో ఇసుకలో తీసిన కాలువలు పూడి పోయి ప్రతి యేటా భగీరథ ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది కూడా స్థానికంగా నీటి పాయలో నీరు తగ్గు ముఖం పట్టడం ప్రారంభించింది. ఇక గడ్డు కాలం నెలకొన బోతుందని గ్రహించిన మణుగూరు మునిసిపాలిటీ అధికారులు రంగంలో దిగారు. గోదావరి ఒడ్డుకు చేరుకున్న మణుగూరు కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఏఈ సత్యనారాయణ, వాటర్ ఇన్‌చార్జ్ అనీల్ తదితరులు పరిస్థితులను పరిశీలించారు. గత కొన్నేళ్లు గాఇక్కడ ప్రజలకు తాగు నీటిని అందించేందుకు తీసకుంటున్న చర్యలను ఏఈ కమీషనర్‌కు వివరించారు.


గోదావరి ఒడ్డున తగ్గుముఖం పట్టిన నీరు


నీటి లభ్యతను పరిశీలిస్తున్న కమిషనర్, ఏఈ

నీటి మళ్లింపునకు ప్రయత్నాలు

ఈ ధఫా పర్ణశాల వైపుఉన్న గోదావరి నీటిని మళ్లించేందుకు ప్రయత్నాలు సాగించేందుకు అధికారులు చర్యలను చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం గోదావరి నదిని పరిశించిన అధికారులు గోదావరి నది పాయలు సమీపంలో లేకుండా పోవడంతో పర్నాశాల నుంచి నీరు మలుపు తిరగే ప్రాంతం నుంచి నీటిని మణుగూరు వైపుకు మళ్లించేందుకు ఇసుక మేట నుంచి ప్రొక్లెయినర్ తో కందకాలను తీసే ప్రయత్నాలకు పూనుకున్నారు. పనులను ప్రారంభించారు. మరో రెండు మూడు రోజుల్లో గోదావరి నీటిని మనుగూరు మంచినీటి ఇన్‌టేక్ వెల్ వైపుకు మళ్లించుతామని ఏఈ తెలిపారు. అలాగే ఇన్‌టేక్ వెల్‌లో పూడికు పోయిన ఇసుకను కూడా తొలగించే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మరోమారు భగీరథ యత్నంలో అధికారులు నిమగ్నమయ్యారు.

భక్తులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి

భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు


మాట్లాడుతున్న ఆర్డీవో

భద్రాచలం, మార్చి 28: సీతారామచంద్రస్వామి కల్యాణం, మహా పట్టాభిషేక మహోత్సవాలు తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తమకు అప్పగించిన పనులను సంబంధిత అధికారులు దిగ్విజయంగా పూర్తి చేసి తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు అన్నారు. గురువారం సబ్‌కలెక్టరు కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు చేపట్టవలసిన కార్యాచరణపై డివిజన్‌స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్యాణం జరిగే మిథిలా స్టేడియంలో కల్యాణ మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించడం జరిగిందని, ప్రతి సెక్టార్లోకి వెళ్లకుండా పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఆన్‌లైన్ ద్వారా లాడ్జీలు బుక్ చేసుకునే విధంగా సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే ఇప్పటి వరకు విధులు నిర్వహంచే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తామని పట్టణంలో పారిశుద్య కార్యక్రమాలు పర్యవేక్షణకు 25 జోన్లుగా విభజించడం జరిగిందని అన్నారు. 30 మంది మంచినీటి పరీక్షలు నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమించినందున ప్రతి సెక్టార్కు మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలని అన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ట భారీబందోబస్తు ఏర్పాటుతో పాటు నాటు పడవలను గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉండేలా సంబంధిత అధికారులు చూసుకోవాలని కోరారు.

క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, మార్చి 28: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని పెడదారి పట్టకుండా జీవితంలో ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. కె వీరభద్రాపురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంటు విజేతలకు గురువారం నగదు, షీల్డు బహుమతులనందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చిన్నారావు, నాయకులు జయసింహ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి శంకుస్థాపన

దుమ్ముగూడెం, మార్చి 28: మండలంలోని కెదుమ్ముగూడెం గ్రామంలో నిర్మించ తలపెట్టిన అభయాంజనేయస్వామి వారి ఆలయానికి గురువారం శంఖుస్థాపన జరిగింది. అర్చకులు ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. గ్రామస్థులు బత్తుల శోభన్‌బాబు, బండారు వెంకటేశ్వరావు, బత్తుల సాయిబాబు, పల్లపు అప్పారావు, బండారు మురళీకృష్ణ, బత్తుల అర్జున్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

జూలూరుపాడు, మార్చి 28: ఉపాధి పనుల నిర్వహణ, కూలీలకు కనీస వేతనం గిట్టుబాటు తదితరాలపై ఈజీఎస్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో ఈసీలు రాజు, వినోద్‌లు పనులకు సంబంధించి మార్కింగ్ ఇచ్చే విధానం, కూలీలకు కనీస వేతనం రూ.300 గిట్టుబాటు కావాలంటే వారు చేయాల్సిన పనులపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలు ఆరుగంటలపాటు కొలతల ప్రకారం పని చేస్తే రోజు వారి రూ. 300వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఏపీవో రవి, ఎంపీవో తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 28: కార్మికులకు రూ.26 వేల నూతన వేతన జీవోను సవరించాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం భద్రాచలం లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 31 వరకు ప్రభుత్వం సమయం ఇచ్చినందున సంబంధిత కార్మికులతో వ్యక్తిగత దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు చేయకుండా జీవోను సవరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయు నాయకులు నాగరాజు, పారెల్లి సంతోష్, రవి ఉన్నారు.

సీఎండీకి సమస్యలపై వినతి

మణుగూరుటౌన్, మార్చి 28: సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలు, కార్మికులు పడుతున్న ఇబ్బందులపై హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీకి మణుగూరు ఏరియా ఐఎన్‌టీయుసీ నాయకులు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఐఎన్‌టీయుసీ కేంద్ర కమిటీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కేంద్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్‌ల ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలో నెలకొన్న సమస్యలను సీఎండీతోపాటు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గట్టయ్య, శ్రీనివాస్, జయరాజు, మల్లిఖార్జున్, కిరణ్, సుధాకర్ తదితరులున్నారు.

చిన్నరావిగూడెంలో వైద్య శిబిరం

మణుగూరు, మార్చి 28: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని చిన్నరావిగూడెం గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. వైద్యులు శివకుమార్ స్థానిక గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అనారోగ్యంతో ఇబ్బంది పడే వారిని పరీక్షించి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా పలువురి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం రాజీవ్ గాంధీ నగర్‌లోని ఎంజేపీటీబీసీ బాలుర హాస్టల్‌లో విద్యనభ్యసించే విద్యార్థులను పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎండాకాలం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, వెంకటలక్ష్మి, హిమబిందు రవి పాల్గొన్నారు.

వైద్యాధికారికి సన్మానం


వైద్యాధికారి రాకేష్ కుమార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు, మార్చి 28: జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి (డీడీవో)గా విధులు నిర్వహిస్తున్న గొల్లపెల్లి రాకేష్‌కుమార్‌కు జిల్లా సర్వేలెన్స్ అధికారిగా పదోన్నతి లభించింది. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయనకు శాలువాలు కప్పి సన్మానించారు. వైద్యాధికారి రాకేష్ కుమార్ విధుల పట్ల అంకితభావంతో పని చేశారని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తేజశ్విని, బి. వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, జేపీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాజు, కాంగ్రెస్ నాయకులు నర్సింహారావు, నాగరాజు, కిరణ్‌కుమార్, కొమ్మిన్ని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక వితరణ


వితరణ అందజేస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం, మార్చి 28: సీతానగరం అగ్నిప్రమాద బాధిత కొప్పుల నీలం-సావిత్రి కుటుంబానికి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం రూ.5వేల ఆర్థిక సాయాన్నందజేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచి తెల్లం వరలక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వివిసిల్, నాయకులు దేవా, శోభన్‌బాబు, రఘు, భద్రయ్య పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అనుభవం ఉండాలి

ఆళ్లపల్లి, మార్చి 28: చేతిలో స్టీరింగ్ పట్టుకున్నంత మాత్రాన ప్రతి ఒక్కరు డ్రైవర్ కాలేడని, కచ్చితంగా డ్రైవింగ్‌లో అనుభవం ఉంటేనే వాహనాలు నడపాలని ఆళ్లపల్లి ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. గురువారం ఆయన ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో వంద మంది వాహనదారులకు డ్రైవింగ్ విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు: సీఎంవో

రుద్రంపూర్, (సింగరేణి), మార్చి 28 : సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు సింగరేణి ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత తెలిపారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో వైద్యసేవలపై సిబ్బందిని అప్రమత్తం చేశామని ప్రకటించారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీవీకే పౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర వైద్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీకే పౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర వైద్యసేవలపై రెండు రోజుల పాటు వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాల వల్ల ఎంతో ఉపయోగం జరుగుతుందన్నారు. సింగరేణి ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హెచ్‌ఆర్‌డీ జీఎం బీహెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో సింగరేణి యాజమాన్యం పని చేస్తుందని తెలిపారు. కార్మికులు ఈ అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎసీఎంవో విక్టర్ వందనం, మట్రొన్‌మిస్ శాలే, వైద్యులు రవీన్, జావెద్, సతీష్, మధుసూధన్, సీనియర్ పీవో ఎం.శ్రీనివాస్‌తోపాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎంవో సుజాత

‘అమ్మకోసం’ ప్రత్యేకమైన పథకం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 28: అమ్మ కోసం పథకం ప్రత్యేకమైనదని భద్రాద్రి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య అన్నారు. గురువారం తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ వివిధ కార్యక్రమాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తుందని అందులో భాగంగా అమ్మ కోసం పథకం ప్రతి మహిళలకు వరంలాంటిది అన్నారు. గర్భం దాల్చింది మొదలు వారి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుందన్నారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు అందించేందుకు ప్రవేశ పెట్టిన కార్యక్రమం ఆరోగ్య మహిళ అన్నారు. ప్రసవ అనంతరం కొందరు బాలింతలు వివిధ కారణాలతో రోగాల భారీన పడుతున్నారని, మరికొందరు అంతు చిక్కని సమస్యలతో మృతి చెందిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇటువంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శాఖ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించదన్నారు. ప్రసవం అనంతరం ఒక సంవత్సరం పాటు తల్లులు, బాలింతలు తమ ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అమ్మ కోసం అనే ఒక బృహత్తర కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ అమ్మ కోసం అనే ఆరోగ్య క్లీనిక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గల అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రతి గురువారం నిర్వహించి వారికి చికిత్స, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావునా భద్రాద్రి జిల్లాలో కాన్పులైన అందరు తల్లులు, బాలింతలు ఈ ఆరోగ్య క్లీనిక్‌లను ఉపయోగించుకొని వారికున్న ఆరోగ్య సమస్యలకు చికిత్స ఉచితంగా పొందాలని సూచించారు.


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ చైతన్య

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడండి: కమిషనర్


ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పాల్వంచ టౌన్ మార్చి 28: పట్టణ పరిధిలో మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఎ.స్వామి ఆదేశించారు. గురువారం కరకవాగు ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించి పలు ప్రాంతాల్లో పర్యటించి మంచినీటి సరఫరా తీరుతెన్నులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులైన్లలో నిలిచిన పనులను కూడా ఆ శాఖాధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేసి లైన్లు పూర్తైన ప్రాంతాలకు కూడా మంచినీరు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఈ కే. రాకేష్, వాటర్ సప్లై సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాల పండుగ


మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు

ములకలపల్లి, మార్చి 28: ములకలపల్లి మండలంలో గురువారం తిమ్మంపేట పంచాయతీ రాజీవ్‌నగర్‌కాలనీ, పుట్టతోగు గ్రామంలో సత్తిమద్ది రామక్క జాతరను ఆదివాసీ గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం గ్రామంలో ఉన్నటువంటి బొడ్రాయి పక్కన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి పిల్లలు, పెద్దలు సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామ ప్రజలు ఉదయం ముత్యాలమ్మ తల్లి గుడి దగ్గర బోనాలు తయారు చేసుకుని వారికి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని గ్రామంలో ప్రతి ఇంటింటికి మేళసంబరాలతో ఊరేగింపు నిర్వహించారు.

సేవాదళ్ మండల కమిటీ ఎన్నిక

జూలూరుపాడు, మార్చి 28: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా వెంగన్నపాలెంకు చెందిన మాడుగుల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ముల్లపాటి అప్పారావు, కార్యదర్శిగా నరకుల్లా ఆదినారాయణలను నియమించారు. దీంతో వారికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి జూలూరుపాడులో నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొదుమూరి కోటేశ్వరరావు, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధనరావు, నాయకులు దుద్దుకూరి సుమంత్, నవీన్ రాథోడ్, వేల్పుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అవకాశం ఇవ్వాలి

దుమ్ముగూడెం, మార్చి 28: వాగుల్లో నాణ్యత లేని ఇసుకకు బదులుగా నదుల నుంచి ఇసుకను ఉచితంగా రవాణా చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొండ చరణ్ గురువారం డిమాండ్ చేశారు. వాగుల నుంచి లభించే ఇసుక నాణ్యత లేకపోవడంతో సిమెంటు నిర్మాణాలు పటిష్టంగా ఉండవని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి ఇళ్ల నిర్మాణాలకు నదుల నుంచి ఇసుకను ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించాలని కోరారు. మండల కార్యదర్శి సాయన్న, శివప్రశాంత్, మునేశ్వరావు తదితరులున్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 28: పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో గల శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు కాకడ హారతితో ప్రారంభమైన పూజలు రాత్రి వరకు కొనసాగాయి. ఉదయం సాయిబాబాకు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు, పూజలు అందంగా అలంకరించారు. పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. బాబావారి మధ్యాహ్నహారతి అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం హారతి అనంతరం ఏడు గంటలకు బాబావారి పల్లకిసేవను అత్యంత భక్తిశ్రద్దల మధ్య నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు, ఆలయ సేవాసమితి బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడు కుటుంబాన్ని ఆదుకుంటాం: రేగా

మణుగూరురూరల్, మార్చి 28: మండల పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన పెనుగొండ నా యుడు బాబు గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం నిర్వహించిన నాయుడు దశదిన కర్మలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో రేగా మాట్లాడారు. నాయుడుబాబు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాపం తెలపడంతోపాటు.. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యం బాబు, సతీష్ రెడ్డి, అడపా అప్పారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అభ్యర్థిగా మురళీకృష్ణ

ఇల్లెందుటౌన్, మార్చి 28: మహబుబబాద్ పార్లమెంట్ న్యూడెమొక్రసీ రెండు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా మోకాళ్ల మురళి కృష్ణ పోటి చేయనున్నట్టు రెండు పార్టీల నాయకులు ప్రకటించారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో న్యూడెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరావు, కేంద్ర కమిటి సభ్యులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. దేశంలో మోడి నాయకత్వంలో హిందుత్వ ఫాసిస్టు విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పౌరహక్కులను హరించి వేస్తున్నారని, ఖనిజసంపద, అడవులను, భూములను కార్పోరేట్ సంస్థలకు ఇస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో విప్లవ శక్తులను, గెలిపించాలని కోరారు.

నేడు గుడ్‌ఫ్రైడే

ప్రత్యేక ప్రార్థనలకు చర్చీల్లో ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 28: గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాలలో ఉన్న చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కమిటీ సభ్యులు గురువారం చేపట్టారు. గత నెల ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 45 రోజుల గుడ్ ఫ్రైడే ఉపవాస దీక్షలను క్రైస్తవ భక్తులు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. గుడ్ ఫ్రైడే రోజున యేసు ప్రభువును సిలువ వేసిన రోజుగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు (సిలువ ధ్యానం) నిర్వహిస్తూ తమ భక్తిని చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ ఆరాధనలో ప్రత్యేక ఆకర్షణగా యేసు ప్రభువును సిలువ వేసిన సమయంలో ఆయన పలికిన ఏడు మాటలను స్మరించుకుంటూ మానవాళి మనుగడకు ఆయన చేసిన త్యాగాలను పాస్టర్లు భక్తులకు తమ సందేశంలో వినిపించనున్నారు. ముఖ్యంగా సిలువ యాత్ర కార్యక్రమమును సింగరేణి మెయిన్ ఆసుపత్రి సెంటర్ నుంచి బూడిదగడ్డ రైల్వే అండర్ బ్రిడ్జీ మీదుగా కొత్తగూడెం ఆర్‌సిఎం చర్చీ కమిటీ సభ్యులు చేపట్టనున్నారు. అనంతరం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక శుభ శుక్రవారం ఆరాధనలు నిర్వహించి దైవారాధన క్రమంతో ముగించనున్నామని ఆర్‌సీఎం ఫాదర్ ఫారీస్ ప్రిస్ట్ ధనరాజ్ తెలిపారు. సాయంత్రం పోస్టాఫీస్ సెంటర్ బస్టాండ్ మీదుగా చర్చీ వరకు భౌతిక ఛాయ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా యేసు ప్రభువు తిరిగి పునరుత్థాన రోజు (ఆదివారం) అత్యంత వేడుకగా అన్ని చర్చీలలో క్రైస్తవ కుటుంబాలు ఘనంగా నిర్వహించుకుంటున్నారని కొత్తగూడెం సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చీ పాస్ట్రేట్ చైర్మన్ భీమాల అభిజిత్ తెలిపారు.



కొత్తగూడెంలోని సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చి